క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

దేవరకద్ర రూరల్: కౌకుంట్లకు చెందిన రఘు నందన్‌కు సీఎంఆర్‌ఎఫ్ నుంచి వచ్చిన రూ.25 వేల చెక్కును ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి కిషన్‌రావు శుక్రవారం లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, నరేష్, ప్రభు, కొండన్న, నీలి నరసింహులు, తుమ్మల నరసింహరెడ్డి పాల్గొన్నారు.

దేవాలయానికి విరాళం..

దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రసిద్ధి చెందిన ఈశ్వర, వీరప్పయ్య దేవాలయాల పునర్నిర్మాణం కోసం నాగరాజుస్వామి, కల్పన దంపతులు రూ. 22,221లు శుక్రవారం విరాళంగా అందజేశారు. దివంగత లింగయ్య పేరున విరాళం అందజేసినట్లు వారు తెలిపారు.

ప్రజలకు నిరంతరం అండగా ఉంటాం

నవాబుపేట: సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతూ ప్రజలకు నిరంతరం అండగా ఉంటామని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ముగ్గుల పోటీల విజేతలకు ఒక కేజీ వెండి బహుమతులు అందించారు. జేకే ట్రస్టు ద్వారా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 465 మంది మహిళలు పాల్గొన్నారు. ప్రతిభభారతికి మొదటి బహుమతి 56 గ్రాముల వెండి పంచపావలి, ద్వితీయ బహుమతి శిరీషా అరతులం వెండి దీపాలు, మరో 160 మందికి వెండి బహుమతులు అందజేశారు. బహుమతులు అందించారు. కార్యక్రమంలో వ్యాపార సంఘం అధ్యక్షుడు సుధాకర్‌చారి, లక్ష్మీనర్సింహాచారి, గీతారాణి, అంజయ్య, శ్రీకాంత్, నిరంజన్, జానకిరాములు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

మిడ్జిల్: మండల కేంద్రంలో చాంపియన్ క్రికెట్ టోర్నీని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. ప్రతి క్రీడాకారుడు ప్రతిభను చాటేందుకు ఇలాంటి వేదికలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గౌస్, ఉస్మాన్, శంకర్, నరేందర్‌రెడ్డి రవింద్ర, నిస్సార్, భాస్కర్ పాల్గొన్నారు.

కులగణనతో లింక్ పెట్టొద్దు

స్టేషన్ మహబూబ్‌నగర్: కొత్త రేషన్‌కార్డుల జారీకి ప్రభుత్వం కులగణన సర్వే లింకు పెట్టవద్దని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌సాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కలెక్టర్ల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కులగణన 96 శాతం పూర్తయిందని చెప్పడం జరిగిందని, కానీ క్షేత్రస్థాయిలో దాదాపు 80 శాతమే పూర్తయినట్లు తెలుస్తుందన్నారు. రేషన్‌కార్డులు లేక చాలా ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజలకు ఇబ్బందులకు గురిచేయకుండా కొత్తకార్డులు వెంటనే జారీచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల జారీకి ఇప్పటివరకు అనుసరించిన దరఖాస్తు విధానం ద్వారా ముందుకు వెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

జడ్చర్ల: స్థానిక 25వ వార్డులోని వెంకటేశ్వర కాలనీ, చౌడమ్మగుట్ట ప్రాంతాలలో శుక్రవారం విద్యుత్ లైన్లకు సంబంధించి అదనంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేశారు. ఎన్నో ఏళ్లుగా విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో సర్వీస్ వైర్లు తెగిపోయి సమస్యలు తలెత్తేవని ఈ సందర్భంగా కాలనీవాసులు తెలిపారు.

నిరక్షరాస్యతతోనే వెనుకబాటు

కోయిల్‌కొండ: మహిళలు నిరక్షరాస్యతతోనే వెనకబడిపోతున్నారని సీడీపీఓ శైలజ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఓఎంఐఎఫ్ ఆధ్వర్యంలో ఒంటరి మహిళలకు వారు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో పెరిగిపోతున్న లింగవివక్షకు, మహిళల పట్ల జరుగుతున్న అఘాత్యాలకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి వారికి వివరించారు.

రైతువేదికల వినియోగంపై ఆరా

నవాబుపేట: గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రైతువేదికలు రైతులకు ఉపయోగపడుతున్నాయా లేదా.. లేక వాటిని ప్రత్యామ్నాయంగా ఇతర వాటిని వినియోగించాలా అనే విషయంలో మానవనరుల శాఖ గుడ్‌గవర్నెన్స్ ద్వారా శుక్రవారం ఆరా తీశారు. ఈ సందర్భంగా మండలంలోని లింగంపల్లి రైతువేదికను ఎంచుకుని అధికారులు సర్వే చేశారు. గ్రామంలో దాదాపుగా 20 మంది రైతులతో అధికారులు మాట్లాడి ఆరా తీశారు. కాగా ఈ సర్వేలో ప్రధానంగా రైతువేదికలు రైతులకోసం ఎంత వరకు ఉపయోగపడుతున్నాయి. ఇతర సదుపాయల కల్పన అవసరం ఉందా అనే అంశం రైతులతో చర్చించారు.

మట్టి రోడ్లే దిక్కు



రాజాపూర్ నుంచి నర్సింగ్‌తండాకు వెళ్లే మట్టిరోడ్డు (ఫైల్)

- తండాలకు కలగా మిగిలిన తారురోడ్లు
- గుంతలు ఏర్పడి ప్రమాదాలు
- మారని గిరిజనుల తలరాతలు
- వర్షకాలంలో ఈరోడ్లపై ప్రయాణం నరకయాతనే



కోతకుగురైన సోమ్లాతండా మట్టిరోడ్డు

రాజాపూర్: గిరిజన తండాలకు నేటికీ మట్టిరోడ్లే దిక్కు అయ్యాయి. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా వారి తలరాతలు మాత్రం మారడం లేదు. తండాలకు తారురోడ్డు అనేది కలగానే మిగిలిందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండాలు గ్రామ పంచాయతీలుగా ఏర్పాటైన అభివృద్ధిలో మాత్రం వెనుకబడి ఉన్నారు. రోడ్డు సౌకర్యం బాగా ఉంటే అన్నివిధాలా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుంది. ఉమ్మడి బాలానగర్, రాజాపూర్ మండలాల్లో మొత్తం 122 గిరిజన తండాలు ఉన్నాయి. అందులో రెండు మూడు తండాలకు మినహా ఎక్కడా కూడా తారు రోడ్లు కనిపించవు. గతంలో వైఎస్ రాజాశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ప్రస్తుత నాగర్‌కర్నూల్ ఎంపీ అప్పటి జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ మల్లురవి గిరిజన తండాలకు స్టేసబ్‌ప్లాన్ ద్వారా నిధులు మంజూరు చేయించి కొన్ని తండాలకు మెటల్‌రోడ్లు మంజూరు చేయించారు. నాటి నుంచి బోడగుట్టతండాలకు మాత్రమే బీటీరోడ్డు వేశారు. మిగతా వీటికి మట్టి రోడ్లే ఉన్నాయి. చినుకు పడిందంటేచాలు మట్టి రోడ్లు చిత్తడిగా మారి నడవలేని దుస్థితి. ఇటీవల కురిసిన వర్షాలకు ఉన్న మట్టిరోడ్లు కోసుకుపోయి వాహనాలు తిరగలేని విధంగా తయారయ్యాయి. ఆపద వేళ అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం గిరిజన తండాలకు బీటీ రోడ్లు ఏర్పాటుచేయించాలని స్థానికులు కోరుతున్నారు.

బీటీ రోడ్లు వేయలేదు



ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ తండాలకు బీటీ రోడ్లు వేయించడం లేదు. చిన్న వానొచ్చినా తండాలకు ఉన్న మట్టిరోడ్లు బురదమయంగా మారుతున్నాయి. గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– రాత్లావత్ సుగుణ, నర్సింగ్‌తండా.

అంబులెన్స్ రావాలన్నా ఇబ్బందే..



తండాలకు ఆపదవేళ అంబులెన్స్ రావాలన్న ఇబ్బందే. రోడ్డు చక్కగా లేక వారు తండాలకు వచ్చేందుకు నిరాకరిస్తున్నారు. ప్రైవేటు ఆటోలు తదితర వాహనాల్లో వెళ్దామన్నా రోడ్ల పరిస్థితి ఇలా ఉండటంతో వారు కూడా వచ్చేందుకు కాస్త ఆలోచిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తండాలకు బీటీ రోడ్లు వేస్తే బాగుండే

– లక్ష్మణ్‌నాయక్, గుండ్లగడ్డతండా

సర్వేలో తప్పులు లేకుండా చూడాలి



ఓబ్లాయిపల్లి గ్రామంలో సర్వే తీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి

- అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

మహబూబ్‌నగర్ రూరల్: ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఓబ్లాయిపల్లిలో నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనను అదనపు కలెక్టర్‌తో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి పరిశీలించి సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన క్షేత్ర స్థాయి పరిశీలనలో సమగ్ర వివరాలు సేకరించాలని శివేంద్రప్రతాప్ అన్నారు. ఈ సందర్భంగా మల్లు నర్సింహారెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అందుతాయన్నారు.

పకడ్బందీగా నిర్వహించండి..

భూత్పూర్: గ్రామాల్లో సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని హస్నాపూర్‌లో అధికారులు చేస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రహమాన్, ఎంపీడీఓ ప్రభాకర్, ఏఈఓ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



భూత్పూర్ మండలం హస్నాపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు

అర్హులకు ప్రభుత్వ పథకాలు

రాజాపూర్: గ్రామాల్లో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కల్లేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొత్త రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్ల గ్రామాల్లో అర్హులైన వారి వివరాలు సేకరించి అర్హులకు అందేలా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వ్యవసాయ శాఖాధికారి ప్రదీప్‌గౌడ్, ఎంపీడీఓ మశ్చందర్ పాల్గొన్నారు.

46వ వార్డులో..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని 46వ వార్డులో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల, కొత్త రేషన్‌కార్డుల సర్వేను శుక్రవారం రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు, మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఆయా పథకాలకు సంబంధించి అర్హుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి జాబితా రూపొందించాలని సిబ్బందికి సూచించారు.

పారదర్శకంగా నిర్వహిస్తాం..

మిడ్జిల్: గ్రామాల్లో సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిల్వేర్ గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. గ్రామాల్లో ఇంటింటికి తిరిగి సర్వే చేశాక గ్రామసభల ద్వారా లబ్ధిదారుల వివరాలు వెల్లడిస్తామన్నారు. ఎంపీడీఓ గీతాంజలి పాల్గొన్నారు.



మిడ్జిల్ మండలం చిల్వేర్‌లో సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి వెంకటేష్

ప్రభుత్వ నిబంధనల..

చిన్నచింతకుంట: ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులకే సంక్షేమ పథకాలు అందుతాయని తహసీల్దార్ ఎల్లయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని గూడురు, తిర్మలాపూరం గ్రామాల్లో సర్వేను నిర్వహించారు.

రైతు భరోసాపై..

దేవరకద్ర/ దేవరకద్ర రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో రైతు భరోసాపై క్షేత్రస్థాయిలో అధికారులు ముమ్మరంగా సర్వేను నిర్వహించారు. శుక్రవారం మండలంలోని చౌదర్‌పల్లి, హజిలాపూర్ గ్రామాల్లో తహసీల్దార్ కృష్ణయ్య బృందం, మీనుగోనిపల్లిలో ఎంపీడీఓ శ్రీనివాసరావు బృందంతో సర్వే నిర్వహించారు. లబ్ధిదారుల వివరాలను నమోదు చేసుకున్నారు.

మున్సిపాలిటీ పరిధిలో..

జడ్చర్ల: ప్రభుత్వం కొత్తగా ఇవ్వనున్న రేషన్ కార్డులకు అర్హులైన వారిని సంబంధిత అధికార సిబ్బంది గుర్తిస్తున్నారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 27 వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. 26వ వార్డులో జరిగిన కార్యక్రమంలో వార్డుఆఫీసర్ శంకర్, మల్లేష్, నాయకులు రఘు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రానున్న వేసవి కాలంలో నీటిఎద్దడిని ఎదుర్కొనేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఐదు కొత్త వాటర్ ట్యాంకు(ట్రాక్టర్)లను ప్రారంభించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆర్‌పీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడా నీటికష్టాలు లేకుండా అన్నిజాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. కొత్త సంఘాలతో పాటు ఇందిరా మహిళా శక్తి కింద వివిధ క్యాంటీన్లు, జీవన్‌ధార మెడికల్ షాపులు, డెయిరీ, కోళ్ల ఫామ్స్ తదితర యూనిట్లు ఏర్పాటుచేయాలన్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. మయూరి బ్రాండ్ పేరుతో ప్రపంచ మార్కెట్‌లో మహిళా సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఉత్పత్తులను ఉంచాలన్నారు. దీనిపై వారికి తగు శిక్షణఇవ్వాలని సూచించారు. మెప్మా సీఓలు, కొందరు ఆర్‌పీల పనితీరు సరిగా లేదని, మహిళా సంఘాల నిధులను పక్కదారి పట్టిస్తున్నట్లు ఇటీవల ఫిర్యాదు అందుతున్నాయని అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డీఎంసీ ఎం.లక్ష్మి, సీఓలు ఆంజనేయులు, నిర్మల, వరలక్ష్మి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, ఇమ్రాన్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల ఆమోదంతోనే లబ్ధిదారుల ఎంపిక

జడ్చర్ల: రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అధికారులు తయారుచేస్తున్నది తుదిజాబితా కాదని, గ్రామసభల ఆమోదం పొందిన తరువాతనే లబ్ధిదారుల తుది జాబితా సిద్ధంచేస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈలోగా అధికారులు తయారుచేసిన జాబితాలో తమ పేర్లులేవని ఆందోళన చెందవద్దని అన్నారు. ఇందుకు సంబంధించి అనేక గ్రామాల నుంచి తమకు ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు.జడ్చర్ల 100 పడకల ఆస్పత్రిలో మౌలిక సౌకర్యాలను మెరుగుపర్చడంతో పాటు డాక్టర్లు, సిబ్బందిని నియమించాలని హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో సంబంధిత వైద్య మంత్రి దామోదర రాజనర్సింహ్మకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. బాదేపల్లి పాత ఆసుపత్రి భవనంలో ట్రామాకేర్ ఏర్పాటు చేయాలని, బాలానగర్‌లో 30 పడకల ఆస్పత్రికి అనుగుణంగా వసతులు, సిబ్బందిని నియమించాలని కోరారు.

అభయప్రద ఆస్పత్రి ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభం చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శెట్టి కాంప్లెక్స్ ఏరియాలో నూతనంగా ఏర్పాటుచేసిన అభయప్రద సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని శుక్రవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎండీ కార్డియాలజిస్ట్ డాక్టర్ విజయ్‌నారాయణ మాట్లాడుతూ 50పడకలతో అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రధానంగా కరోనరీ యాంజియోగ్రాం, స్టెంటింగ్ ఆధునిక క్యాథ్‌ల్యాబ్, క్రిటికల్ కేర్ ఫెసిలిటీ, ఫేస్‌మేకర్ ఇంప్లాంటేషన్,2డీ ఎకో, కలర్ డాప్లర్‌లతో పాటు అన్నిరకాల సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆస్పత్రిలో నేడు(శనివారం) ఉచితంగా ఈసీజీ, 2డీ ఎకో, కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ భారతి, డాక్టర్ కె.బాలకృష్ణ, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రాంమోహన్, డాక్టర్ వెంకట్‌రాంరెడ్డి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

20న చలో తహసీల్దార్ కార్యాలయం



మహబూబ్‌నగర్ న్యూటౌన్: పట్టణంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 20న చలో తహసీల్దార్ కార్యాలయం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీఎఫ్‌టీయూ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం.ఖలీల్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పి.విజయ్‌కుమార్, జిల్లా నాయకుడు జలాల్‌బాషా అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్‌లోని మదీనా మజీద్, వీరన్నపేట, ఎర్రమన్నుగుట్ట, తదితర ప్రాంతాల్లో కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు.

జ్యోతిబసుకు ఘన నివాళి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మార్క్సిస్టు మహోన్నత దిగ్గజం కామ్రేడ్ జ్యోతిబసు అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కిల్లెగోపాల్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆపార్టీ కార్యాలయంలో జ్యోతిబసు 14వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆపార్టీ కార్యదర్శివర్గ సభ్యులు నల్లవెల్లి కురుమూర్తి, రాజ్‌కుమార్, వర్ధగాలెన్న, తిరుమలయ్య, వెంకటయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

‘పేదోళ్లమని బాధపడొద్దు’



టి.ఎస్.శ్రీధర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పేదోళ్లమని బాధపడొద్దని, కడుపు కాలినోడికి కసి ఉంటుందని తప్పక గొప్పోడవుతాడని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రం లోని కలాం ల్యాబ్‌లో డైరీ విద్యావారధి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బున్నోడు ఏసీల్లో హాయిగా గడిపేవాళ్ల మేధావులు కాలేరని అన్నారు. ఏదో ఒకటి చేయాలన్న తపన ఉంటే జీవితంలో అనుకున్నది సాధించవచ్చన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం లాంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం సొంత ఇంటి పైనే సైన్స్ ల్యాబ్‌ను ఏర్పాటుచేసి, ఎంతో మంది విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ల్యాబ్ వ్యవస్థాపకుడు, ఉపాధ్యాయుడు టి.ఎస్.శ్రీధర్‌ను అభినందించారు. డ్రీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ల్యాబ్ అధ్యక్షుడు జనార్దన్, ఉపాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, పర్యావరణ ప్రచారకర్త సురేష్‌గుప్తా, విశ్రాంత ఆచార్యులు వెంకటేశ్వర్లు, రిటైర్డ్ డీఈఓ విజయకుమార్, ఎన్నారై రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



కిక్కిరిసిన బస్టాండ్

సంక్రాంతి పండుగ సెలవులు ముగియనుండడంతో రెండు రోజుల నుంచి మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్ కిక్కిరిసిపోయింది. ముఖ్యంగా హైదరాబాద్, తాండూర్, వనపర్తి, పరిగి, శ్రీశైలం, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ రూట్లలో ప్రయాణికులు అధికసంఖ్యలో కనిపించారు. బస్సులు ఆయా ప్లాట్‌ఫాంల వద్దకు రాకుండానే ప్రయాణికులు ఎక్కుతున్నారు. ఆదివారం మరింత ప్రయాణీకుల రద్దీ ఉండే అవకాశం ఉంది.

– స్టేషన్ మహబూబ్‌నగర్

పూలే విగ్రహం తొలగింపుపై ఆందోళన

- అధికారులతో వాగ్వాదం



ఏఈపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

జడ్చర్ల: స్థానిక సిగ్నల్‌గడ్డలో జరుగుతున్న రోడ్డువిస్తరణ పనుల్లో భాగంగా అధికారులు అక్కడ ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని తొలగించి తహసీల్దార్ కార్యాలయంలో ఉంచారు. విషయం తెలుసుకున్న బీసీ, దళిత తదితర సంఘాల నాయకులు శుక్రవారం పెద్దఎత్తున అక్కడికి చేరుకొని ఆందోళన వ్యక్తం చేశారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య, మాజీ సర్పంచ్ రేణుక, బీసీ సంఘాల నాయకులు కృష్ణయాదవ్, బాలవర్ధన్‌గౌడ్, శ్రీకాంత్, శివకుమార్ విగ్రహం తొలగింపునకు సంబంధించి తమకు కనీస సమాచారమివ్వకుండా తొలగించడం ఏమిటని అధికారులపై మండిపడ్డారు. మిగతా విగ్రహాలను తొలగించకుండా కేవలం పూలే విగ్రహం మాత్రమే తొలగించడం ఏమిటని నిలదీశారు.తాము రోడ్డు పనులకు వ్యతిరేకం కాదని,అందరి సమ్మతితతో సముచిత స్థానంలో విగ్రహాలను ఏర్పాటు చేస్తే అందరికి మంచిదన్నారు. తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి సంబంధిత నాయకులతో సమావేశమయ్యారు. రోడ్డు విస్తరణ పనులకు అడ్డుగా ఉన్న విగ్రహాలను అక్కడ నుంచి తొలగించేందుకు సంబందిత అధికారులు గతంలోనే మున్సిపల్ కమిషనర్‌ను కోరినట్లు తహసీల్దార్ బ్రహ్మంగౌడ్ వివరించారు. పాలక మండలిలో చర్చించడం, సంబంధిత కుల సంఘాలు, అభిమానులు, పార్టీల నేతలతో సమావేశమై నిర్ణయం తీసుకోవలసి ఉండగా ఏఈ తమకు కూడా కనీస సమాచారమివ్వకుండా తొందర పడ్డారని నచ్చజెప్పారు. అందరి ఆలోచనల మేరకు విగ్రహాల తొలగింపుపై నిర్ణయం తీసుకుంటామని, ప్రస్తుతానికి విగ్రహాన్ని యధాతథంగా ఏర్పాటు చేస్తామని హామీఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. సంబంధిఏఈ రవికుమార్ మద్యంమత్తులో తమ ఇష్టానుసారంగా విగ్రహం తొలగించారని, అతనికి మద్యం పరీక్షలు నిర్వహించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ బ్రహ్మంగౌడ్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ చంద్రమోహన్ బందోబస్తు ఏర్పాటు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- సహకార సంఘం చైర్మన్ నర్సింహులు

నవాబుపేట: సహకార సంఘంలో రుణాలు చెల్లించని మొండి బకాయిదారులకు ప్రభుత్వం ఓటీఎస్(వన్‌టైం సెటిల్‌మెంట్) అవకాశం కల్పించిందని, దీన్ని రైతులు సద్వినియోగించుకోవాలని సహకార సంఘం చైర్మన్ నర్సింహులు సూచించారు. శుక్రవారం స్థానిక సహకార సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2018 సంవత్సరానికి ముందు రుణాలు పొందిన రైతులకు వడ్డీ చాలా పెరిగిందన్నారు. దీంతో తాజాగా ప్రభుత్వం ఈనెల 15 నుంచి వచ్చేనెల ఫిబ్రవరి 15 వరకు వన్‌టైం సెటిల్‌మెంట్ అవకాశం కల్పించినట్లు ఆయన ప్రకటించారు. దీంతో 204 మంది రైతులకు ఈ అవకాశముందని, దీన్ని సద్వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో సహకార సంఘం సీఈఓ హన్మంత్ తదితరులు ఉన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం



టోల్‌ప్లాజాలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న పీఎం దీపా మాడియా

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ శివారులో ఉన్న టోల్‌ప్లాజా వద్ద వేస్టర్న్ ఆంధ్రా టోల్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 36వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఎస్‌వీఎస్ ఆస్పత్రి సహకారంతో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ప్రాజెక్టు మేనేజర్(పీఎం) దీపా మాడియా రక్తదానం, కంటి, ఉచిత వైద్య శిబిరాలను ప్రారంభించారు. 25 మంది దాతలు రక్తదానం చేశారు. టోల్‌ప్లాజా సిబ్బందితో పాటు వాహనాల డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆపరేషన్స్ మేనేజర్ సంతోష్‌కుమార్, మెయింటెనెన్స్ మేనేజర్ జితేందర్, అకౌంట్స్ మేనేజర్ సతీష్, పరికరాల విభాగం మేనేజర్ కిరీటి, సీనియర్ క్యాషియర్ సురేందర్‌రెడ్డి, టోల్‌ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.